

విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్

మూఢనమ్మకాలతో మోసపోవద్దు

కవాడిగూడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలను నమ్మి మోస పోవద్దని, సైన్స్ ప్రకారం నడుచుకోవాలని బాలోత్సవ కమిటీ చైర్మన్ సోమయ్య, వైస్ చైర్మన్ మమత సూచించారు. మూఢ నమ్మకాలపై ఉన్న అపోహ తొలగించి అవగాహన కల్పించేందుకు కవాడిగూడ ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్‌కు చెందిన 5వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను వారితోపాటు తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి ఎగ్జిబిషన్‌లు దోహదపడతాయన్నారు. మూడు ఎగ్జిబిట్‌లను ఎంపిక చేశామని, వాటిని ఈనెల 24న జరిగే సీవీ రామన్ సైన్స్ డే సందర్భంగా ఇంటర్ స్కూల్ పోటీల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ స్వర్ణలతారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కర్పూరీ ఠాకూర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వి. హనుమంతరావు తదితరులు

కర్పూరీ ఠాకూర్ వర్ధంతి.. అధికారికంగా నిర్వహించేందుకు సీఎంతో మాట్లాడతా

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరీ ఠాకూర్ వర్ధంతిని ఈనెల 17న అధికారికంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని మాజీ ఎంపీ వి. హనుమంతరావు అన్నారు. కర్పూరీ ఠాకూర్ ఫౌండేషన్ హైదరాబాద్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జంపాల రాజేష్ ఆధ్వర్యంలో రూపొందించిన కర్పూరీ ఠాకూర్ క్యాలెండర్‌ను బాగ్‌అంబర్‌పేటలో తన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్పూరీ ఠాకూర్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రికి లేఖరాశానన్నారు. ఆయన ఆశయ సాధనకోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఠాకూర్‌కు భారతరత్న అవార్డు రావడం నాయీబ్రాహ్మణ సామాజికవర్గానికి గర్వకారణమన్నారు. ఐఎన్‌టీఆర్ తెలంగాణ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రంగాసాయిభట్టు, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ ఎంపీ టికెట్ లంబాడీ మహిళకే కేటాయించాలి

● టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నూనావత్ రాధ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ ఎంపీ టికెట్(ఎస్టీ) లంబాడీ మహిళకే కేటాయించాలని టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, మహబూబాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధా పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ ఎంపీ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్నారని, తనకు టికెట్ కేటాయిస్తే భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో లంబాడీ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు విన్నవించానని, ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. అధిష్ఠానం తన సేవలను గుర్తించి ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరారు.

'సాక్షరభారత్ కో-ఆర్డినేటర్లకు ఉద్యోగాలు ఇవ్వాలి'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మోదీ, కేసీఆర్ సాక్షర భారత్‌ను రద్దు చేసి పొట్టకొట్టారని వయోజన విద్య సాక్షరభారత్ కో-ఆర్డినేటర్ల సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఎం. కృష్ణంరాజు ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల తీరుతో రాష్ట్రంలో వయోజన విద్య సాక్షరభారత్‌లో విధులు నిర్వహిస్తున్న 443 మంది మండల కో-ఆర్డినేటర్లు, 17,863 మంది గ్రామ కో-ఆర్డినేటర్లు ఉద్యోగాలు పోయి వీధిన పడ్డారని అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో మండల, గ్రామ కో-ఆర్డినేటర్లను నియమించాలని కోరారు. కో-ఆర్డినేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడతమల్ల సురేష్, నాయకులు రమణగౌడ్, శ్రీనివాస్, స్నేహలత, వినోద్, రవి, మేధా తదితరులు పాల్గొన్నారు.

'సుబ్బరాయశర్మ సహజ నటుడు'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రంగస్థల నటుడిగా అనంతర కాలంలో టీవీ సీరియల్స్‌కు తదుపరి సినిమాలకు అంచెలంచెలుగా ఎదిగిన సుబ్బరాయశర్మ సహజనటుడు అని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేషశయన రెడ్డి అన్నారు. స్వరసుధాఝరి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగాన సభలో ఉప్పులూరి సుబ్బరాయశర్మకు ప్రఖ్యాతనటుడు శోభన్‌బాబు స్మారక పురస్కార ప్రదాన కార్యక్రమం జరిగింది. జస్టిస్ శేషశయనరెడ్డి మాట్లాడుతూ.. శోభన్‌బాబు వివాదాలకు అతీత నటుడు అని, ఆయన సినిమాలు అసభ్యతకు తావులేకుండా ఉంటాయన్నారు. కళాపోషకుడు చిల్ల రాజశేఖరరెడ్డి, నటుడు జెన్నీ, పద్మరావు, త్యాగరాజు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా బ్రహ్మంగారి కాలజ్ఞానం బుర్రకథ

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పిన కాలజ్ఞానంను బుర్రకథ రూపంలో సాలం కృష్ణయ్య బృందం ఆసక్తికరంగా చెప్పింది. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రిటైర్డ్ ఏఐఎస్ అధికారి డా. కేవీ రమణాచారి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా సూర్యాపేటకు చెందిన సాలం కృష్ణయ్య బృందం బుర్రకథ చెప్పింది. అనంతరం జరిగిన సభలో పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, బేవరేజెస్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ.. రమణాచారి సాహిత్యానికి, కళలకు చేస్తున్న సేవ అపారం అని అన్నారు. మరుగున పడుతున్న హరికథ, బుర్రకథల పరిరక్షణకు సాంస్కృతిక సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వాలు ఇలాంటి కళలను పోషించాలన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. బుర్రకథ కళాకారులు సహకరిస్తే వారంపాటు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర బుర్రకథ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సాయికుమార్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

సాయికుమార్‌కు విశ్వనాథ్ పురస్కారం

ప్రముఖ సినీనటుడు, డైలాగ్‌కింగ్ సాయికుమార్‌కు కె. విశ్వనాథ్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు బహూకరించారు. గానసభ ప్రధానహాలులో ఆనందభైరవి సంస్థ 12వ వార్షికోత్సవాల సందర్భంగా జీవితం సప్తసాగర గీతం పేరిట తెలుగు, హిందీ సినీ గీతాల ఆలాపన కార్యక్రమం ఎస్‌బీఐ, సుచిరిండియా, సీల్‌వెల్, రాగ ఎస్టేట్స్ సహకారంతో నిర్వహించారు.

ఈ సందర్భంగా వంశీరామరాజు, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, టీవీ నిర్మాత నాగబాల సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, అనంతరం సినీనటుడుగా, డైలాగ్ డెలివరీలో ప్రత్యేకతను చాటుకున్న సాయికుమార్ పోలీస్‌స్టోరీ వంటి సినిమాల్లో చేసిన నటన తెలుగు జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. ప్రముఖ గాయని శారదాసియి, సురేఖామూర్తి, వినోద్‌బాబు, రాగమయి, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు తీశారు.. వదిలేశారు

ముందుకు సాగని కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు

కవాడిగూడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు గుంతలకే పరిమితమయ్యాయి. ఉన్నికోటలో కాంట్రాక్టర్ మూడు నెలల క్రితం గుంతలు తవ్వి వదిలేయడంతో ఇబ్బంది పడుతున్నామని బస్తీవాసులు వాపోయారు. పిల్లలు ఆడుకుంటూ గుంతల్లో పడి గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో హడావిడిగా కవాడిగూడ ఉన్నికోటలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించే కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ గుంతలు తవ్వాడే తప్ప పనులు ముందుకు సాగడం లేదు. కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



ఉన్నికోట బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తవ్విన గుంతలు

పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటా



కమ్యూనిటీహాల్ విషయం తన దృష్టికి వచ్చింది. పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటాను. వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశిస్తాను.

- ముఠా గోపాల్, ఎమ్మెల్యే

స్థానికులు ఇబ్బంది పడుతున్నారు



కమ్యూనిటీహాల్ పనులు వెంటనే ప్రారంభించాలి. గుంతలు తీసి వదిలేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నిర్మాణ పనులు పూర్తి చేసి కమ్యూనిటీహాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

- జి. రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు



ఎన్నికల ముందు హడావిడిగా గుంతలు తీసి వదిలేశారు. నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. కమ్యూనిటీహాల్ నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. **- ప్రమోద్, ఉన్నికోట బస్తీ నివాసి**

బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీఎంను చెప్పుతో కొడతానని సుమన్ వ్యాఖ్యానించడం అత్యంత దుర్మార్గమని, ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మానుకోకపోతే ప్రతిదాడులు తప్పవని ఆయన హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఈ పద్ధతి మానుకోకపోతే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్‌సింగ్, షాహిద్‌ఖాన్, చక్రపాణి, దంత కృష్ణ, మహేష్, కిషన్‌సింగ్, విజయ్‌కాంత్, సూర్యప్రకాష్, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాంనగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్క సుమన్‌కు యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కవితకు జ్యోతీరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని ఇప్పుడు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు తగదు

చిక్కడపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకుడు బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని మహిళా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్ పేర్కొన్నారు. బాల్కసుమన్ తన మాటలను వెనక్కి తీసుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

బీసీల హక్కుల కోసం రాజీలేని పోరాటం

జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల కోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తామని, హక్కుల సాధనే ధ్యేయంగా ఢిల్లీ గడ్డపై బీసీలంతా దండెత్తాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ నెల 8, 9 తేదీలలో చేపట్టిన బీసీల చలో ఢిల్లీ కార్యక్రమానికి కాచిగూడ, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్ల నుంచి వందలాదిమంది బీసీ శ్రేణులు మంగళవారం ఢిల్లీ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలు అంటే వెనుకబడిన తరగతులు కాదని, బ్రిలియంట్, బిగ్గెస్ట్ కులాలని, ఇలాంటి కులాలపై కేంద్ర ప్రభుత్వం వివక్షతతో వ్యవహరిస్తూ బీసీల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకుండా, చట్టసభలో రాజకీయ రిజర్వేషన్ కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని పాలకులపై మండిపడ్డారు. ఢిల్లీ పెద్దల మెడలు వంచి బీసీ హక్కులు సాధించడానికి బీసీ శ్రేణులు కేంద్రంపై సమరభేరి మోగించడానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లీ వెళ్లిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, నాయకులు గొడుగు మహేష్‌యాదవ్, కనకాల శ్యామ్‌కురుమ, జాజుల లింగం, వరికుప్పలమధు, గూడూరు భాస్కర్, సిద్ధాంతం శ్యామల, సమతాయాదవ్, తారకేశ్వరి, మహేష్ తదితరులు ఉన్నారు.



ఢిల్లీ వెళ్తున్న బీసీ నేతలతో జాజుల శ్రీనివాస్‌గౌడ్

తిలక్‌నగర్ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిలక్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన బస్తీ కమిటీ అధ్యక్షుడు కొక్కు అనిల్‌కుమార్ ఎమ్మెల్యేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బస్తీలో సమస్యలు, కమ్యూనిటీ హాల్‌పై అంతస్తు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వివరించారు. అనిల్‌కుమార్‌ను కాలేరు వెంకటేష్ శాలువాతో సత్కరించారు. బస్తీ కమిటీ నేతలు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లో కలుషిత నీటి సమస్య పరిష్కరించాలని, పైపులైన్లకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి కార్పొరేటర్ రవిచారి మంగళవారం వినతిపత్రం అందజేశారు. రవిచారి మాట్లాడుతూ.. బాగ్‌లింగంపల్లి, చిక్కడపల్లి, హరినగర్, బాకారం తదితర ప్రాంతాల్లో కలుషిత నీటి సమస్య ఉందన్నారు.



జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రవిచారి

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు బాధితులకు అందజేత



చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను బాధితులకు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య



జితేందర్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న ప్రసాదరావు

కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ముషీరాబాద్ అధ్యక్షుడిగా ప్రసాదరావు నియామకం

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడిగా పిరంగి ప్రసాదరావు నియమితులయ్యారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆయనకు మంగళవారం నియామకపత్రం అందజేశారు. ప్రసాదరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు.

సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బుసమల్ల మైఖేల్ ప్రసన్న



చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు బుసమల్ల మైఖేల్ ప్రసన్న నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు ఎం అనిల్‌కుమార్ యాదవ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. మైఖేల్ ప్రసన్న మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పింఛన్ ఇవ్వాలంటూ నిరసన

ముషీరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పింఛన్ డబ్బులు వెంటనే లబ్ధిదారుల ఖాతాలో జమచేయాలని బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ యువజన కమిటీ అధ్యక్షుడు కె.ఎం. సాయి డిమాండ్ చేశారు. పింఛన్ అందని దివ్యాంగులు మంగళవారం రంగానగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ప్రతినెల ఒకటో తేదీలోపు ఖాతాలో డబ్బులు జమ అయ్యేవమని, ఇప్పటి వరకు పింఛన్ ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. పింఛన్‌దారులు శ్రీనివాస్, జగదీష్, ప్రభు, వసంత, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



జయదేవ్ నారాయణను సత్కరిస్తున్న అతిథులు

ఆకట్టుకున్న భక్తమార్కండేయ హరికథాగానం

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నల్లకుంట శంకరమఠంలో జరుగుతున్న హరికథా మహోత్సవంలో భాగంగా మంగళవారం భాగవతార్ కట్ట జయదేవ్ నారాయణ నిర్వహించిన భక్తమార్కండేయ హరికథాగానం ఆకట్టుకుంది. జీఎస్‌టీ తెలంగాణ రాష్ట్ర అడిషనల్ కమిషనర్ దాసరి బాలయ్య, గుమ్మడి గోపాలకృష్ణ, కిన్నెర రఘురామ్, రాఘవరెడ్డి, కృష్ణారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. భాగవతార్ కట్ట జయదేవ్ నారాయణను అతిథులు సత్కరించారు.

మహిళను వేధించిన యువకుడికి జైలు శిక్ష

చిక్కడపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధించిన యువకుడికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించింది. అశోక్‌నగర్‌లో ఓ మహిళను పి. నరేష్‌కుమార్ వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. కేసును విచారించిన ప్రత్యేక మేజిస్ట్రేట్ ఎస్. సత్యనారాయణ నిందితుడికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు.

బీజేపీ సీనియర్ నాయకురాలు కన్నుమూత



ఆండాళమ్మ (ఫైల్)

అంబర్‌పేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకురాలు బత్తుల ఆండాళమ్మ(65) మంగళవారం మృతి చెందింది. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు దాసోజు నాగభూషణం చారి, బీజేపీ నేతలు ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆండాళమ్మ భౌతికకాయానికి హర్రాజీపెంటలోని హిందూ శ్మశాన వాటికలో మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.

భర్తకు తనపై ప్రేమ తగ్గిందని ఆత్మహత్య

అంబర్‌పేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భర్తకు తనపై ప్రేమ తగ్గిందని మనోవేదనకు గురై ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకకు చెందిన భవానీ(32) ఆరు సంవత్సరాల క్రితం అంబర్‌పేటకు చెందిన అభిలాష్‌ను ప్రేమ వివాహం చేసుకున్నది. తిరుమల నగర్‌లో నివసిస్తున్నారు. అభిలాష్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి సంతానం లేదు. ఆరు నెలల నుంచి అతడు భార్యతో చిన్న చిన్న విషయాలకు గొడవపడుతున్నాడు. దీంతో భవానీ భర్తకు తనపై ప్రేమ తగ్గిందని భావించింది. సోమవారం రాత్రి ఇంట్లో బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తల్లి ఫిర్యాదు మేరకు అంబర్‌పేట పోలీసులు అభిలాష్‌పై కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి సోమవారం అర్ధరాత్రి ఫలక్‌నూమా - బుద్వేల్ రైల్వే స్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో వేగంగా వస్తున్న రైలు అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో దాడి.. చోరీలు

● ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



నిందితులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి దాడి చేస్తూ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాచిగూడ పీఎస్ పరిధిలో వరుసగా రెండు రోజుల నుంచి ఇలాంటి సంఘటనలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో అంబర్‌పేట పటేల్‌నగర్‌లో నివసిస్తున్న ఓ కుటుంబం నాంపల్లి ఎగ్జిబిషన్‌కు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో గోల్నాక వైన్స్ పక్కన బాలాజీ మిఠాయి బండార్ వద్ద తాగునీటి బాటిల్ కొనుగోలు చేయడానికి ఆటో ఆపారు. అదే సమయంలో మహిళ, ఓ వ్యక్తి ఆటో వద్దకు వెళ్లి బాలిక చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించారు. బాలిక ప్రతిఘటించడంతో మహిళ బాలిక, అడ్డు వచ్చిన తల్లి, ఆటో డ్రైవర్‌పై దాడికి యత్నించింది. బాలిక తండ్రి కాచిగూడ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దాడి చేసిన మహిళ, ఆమె అనుచరుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరూ ప్రతిరోజూ మద్యం తాగి ప్రయాణికులపై దాడిచేసి చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెన్నారెడ్డినగర్ ఎస్వీఆర్ గార్డెన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి దాదాపు వందమంది యువకులు రోడ్డుపై గొడవకు దిగారు. రహదారిపై వెళ్తున్న వారిపై దాడి చేయడానికి యత్నించారు. దీంతో వాహనదారులు భయాందోళనతో పరుగులు తీశారు.

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన కోసం అందరూ కృషి చేయాలని హైదరాబాద్ జిందాబాద్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధి సాంబశివరావు సూచించారు. మంగళవారం వైఎస్‌ఆర్ పార్కు వద్ద గల మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హైదరాబాద్ జిందాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో కల్చరల్ ఫెస్టివల్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సాంబశివరావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు రవీంద్రభారతిలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. సిటిజన్స్ ఫోరం కో-ఆర్డినేటర్లు శ్రీవల్లి, రాజమౌళి, బీఆర్‌ఎస్ మహిళా కమిటీ ముషీరాబాద్ డివిజన్ సీనియర్ నాయకురాలు రజిని, ఎంసీహెచ్ కాలనీ ఈస్ట్ పార్సిగుట్ట వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిందాబాద్ సిటిజన్స్ ఫోరం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

పర్యావరణాన్ని కాపాడాలి

రాంనగర్: విద్యార్థులు పుస్తకాలతోపాటు సమాజాన్ని చదవాలని, ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజాకవి డాక్టర్ జయరాజు అన్నారు. హైదరాబాద్ జిందాబాద్, రాంనగర్, నల్లకుంట డివిజన్ల ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమికొట్టండి అనే అంశంపై జోన్ స్థాయి పోటీలు మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. కార్యక్రమాన్ని ప్రారంభించిన జయరాజు మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడడం నేటి విద్యార్థుల కర్తవ్యం అని సూచించారు. మానవ మనుగడకు ప్రకృతే జీవనం అని అన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సినీ నిర్మాత శివనారాయణ, సమాజ సేవకుడు సీహెచ్. రాజీవ్, హైదరాబాద్ జిందాబాద్ సంస్థ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 11న జరిగే కల్చరల్ ఫెస్టివల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.



కల్చరల్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన జయరాజు, కె.వీరయ్య తదితరులు